నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 1 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## ట్యాంకర్‌తో నీరు సరఫరా

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**



గొల్లపల్లిలోని వడ్ల వాడలో వాటర్ ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్న పంచాయతీ సిబ్బంది

నెన్నెల,మార్చి31 : గొల్లపల్లిలో నెలకొన్న తాగు నీటి సమస్యను వివరిస్తూ సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'గొంతెండుతున్న గొల్లపల్లి' శీర్షికన కథనం ప్రచురితమవ్వగా అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సాయి తేజ్ ట్యాంకర్ ద్వారా వడ్లవాడలో ఇంటింటికీ సరిపడా నీరు సరఫరా చేయించారు. అనంతరం ఎండిపోయిన చేద బావులను పరిశీలించారు. మిషన్ భగీరథ పైపులైన్‌ను పరిశీలించారు. కాగా, తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## 'నమస్తే' కథనానికి కదిలిన అధికారులు



మహిళ తో మాట్లాడుతున్న ఏఈ

భీమారం, మార్చి 31 : పొలంపల్లి గ్రామంలో తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'బోరు పాడైపోయింది.. బాగు చేయరూ' శీర్షికన కథనం ప్రచురితం కాగా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రవీందర్, డీఈ విద్యాసాగర్ స్పందించారు. పోలంపల్లి గ్రామ పంచాయతీకి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజమౌళిని పంపించగా, ఆయన మిషన్ భగీరథ నీరు సరఫరా గురించి ఆరా తీశారు. మహిళలు మాట్లాడుతూ నీరు సరిగా రావడం లేదని.. కనీసం రెండుమూడు రోజులకోసారి తాగు నీరు సరఫరా చేయాలని కోరారు. మిషన్ భగీరథ నీరు రానివారి పేర్లు నమోదు చేసుకోవాలని వర్కర్లకు ఏఈ సూచించారు. అలాగే బోరును పరిశీలించి నిధులు లేవని, మరమ్మతులు చేయడానికి వీలు కాదని ఏఈ రాజమౌళి తెలిపారు.



# ఘనంగా ఈద్ ఉల్ ఫితర్

కెరమెరి : మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు




శుభాకాంక్షలు తెలుపుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నమస్తే బృందం : మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో సోమవారం ఈద్-ఉల్-ఫితర్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేయగా, ఆదివారం సాయంత్రం ముగిశాయి. సోమవారం ఉదయమే ఈద్గాలు, మసీదుల వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని సామూహిక ప్రార్థనలు చేశారు. మత పెద్దల సందేశాలను శ్రద్ధగా విన్నారు. మంచిర్యాల పట్టణంలోని క్వారీ, బస్టాండ్ ఈద్గాల వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పాల్గొన్నారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈద్గా వద్ద, ఆండాలమ్మ కాలనీలోని మసీదు వద్ద నిర్వహించిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు, చెన్నూర్, మందమర్రిలో ఎమ్మెల్యే గడ్డం వివేక్ పాల్గొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల ఇండ్లకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు వెళ్లి విందు స్వీకరించారు.



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు



# ముస్లింల నిరసన

రెబ్బెనలో ఈద్గా వద్ద నల్లబ్యాడ్జీలు ధరించిన ముస్లింలు

- వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- రంజాన్ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రార్థనల అనంతరం నిరసన

*ముస్లిం వక్ఫ్ బోర్డు బిల్లు సవరణకు వ్యతిరేకంగా ముస్లింలు నిరసన తెలిపారు. రెబ్బెన, రామకృష్ణాపూర్‌లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం 2024 ఆగస్టు 8న పార్లమెంట్‌లో ముస్లింలకు వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.*

*- రెబ్బెన, రామకృష్ణాపూర్, మార్చి 31*




రామకృష్ణాపూర్‌లోని ఈద్గా వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

# మంత్రి పదవి @ రూ.8 కోట్లు..?

**రూ.8 కోట్లు ఇస్తావా.. మంత్రి పదవి వదులుకుంటావా అని ప్రశ్నించిన ఓ ఎమ్మెల్యే..!**

- మంత్రి పదవి వద్దు.. నా భార్యకు కార్పొరేషన్ పదవి కూడా వద్దు
- ఆ డబ్బులు మాత్రం నన్ను అడగకు.. అంటూ బేరం కుదుర్చున్న మరో ఎమ్మెల్యే
- జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిన వ్యవహారం



మంచిర్యాల, మార్చి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ''భయ్యా.. నువ్వు ఎమ్మెల్యేగా గెలిచాక నా దగ్గర రూ.8 కోట్లు తీసుకున్నావ్. అవి కాకుండా ఎంపీ ఎన్నికల్లో నా వాళ్లని గెలిపించేందుకు అదనంగా డబ్బులు కూడా ఇచ్చాను. నువ్వు ఎంపీ ఎన్నికల్లో డబ్బులు తీసుకోకుండా పని చేసినా.. నేను ఆలోచించే వాడిని. కానీ, నువ్వు నా దగ్గర డబ్బులు తీసుకొని కూడా కో ఆపరేట్ చేయలేదు. అది వదిలేయ్. నాకు ఇప్పుడు మంత్రి పదవి వచ్చేలా ఉంది. నా పదవికి నవ్వు అడ్డురావొద్దు.. నీకు పదవి కావాలంటే నీ పైరవీ ఏదో నువ్వే చేసుకో.. నాకు అడ్డు వస్తే మాత్రం నా రూ.8 కోట్లు తిరిగి ఇవ్వాలి. నీ పర్సనల్ చెక్కులు పెట్టి.. నా దగ్గర రూ.8 కోట్లు తీసుకొని ఆరు నెలల్లో తిరిగి ఇస్తానని బాండ్ రాసిచ్చావ్. మంత్రి పదవికి నువ్వు అడ్డు వస్తే నువ్వు ఇచ్చిన చెక్కులు బౌన్స్ చేసి నేను లీగల్ నోటీసు పంపిస్తా'' అంటూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓ ఎమ్మెల్యే మరో ఎమ్మెల్యేకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. దానికి మంత్రి పదవి రేసులో ఉన్న సదరు ఎమ్మెల్యే ఆ రూ.8 కోట్లు ఇప్పుడైతే ఇవ్వలేను. నాకు మంత్రి పదవి వద్దు... నా భార్యకు కార్పొరేషన్ పదవి వద్దు. ఏం లేకున్నా మంచిదే.. ఆ డబ్బులైతే అడగకు. నా నియోజకవర్గానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. నదిపై కట్టలు కట్టడానికనో.. విద్య లేదా వైద్య ప్రాజెక్టుల కోసమనో నిధులు ఇచ్చారు. ఇందులో ఎంతో కొంత మిగుల్చుకొని నేను ఇవ్వాల్సిన దగ్గర ఇచ్చుకుంట. ఈ డబ్బులు మాత్రం అడగొద్దు అంటూ బేరం కుదుర్చుకున్నారట. ఇప్పుడు ఈ విషయం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గతంలో అధికార పార్టీ తరపున ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యే, అదే పార్టీ నుంచి జిల్లా కేంద్రంగా ఉన్న నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచిన మరో ఎమ్మెల్యేకు రూ.25 లక్షలు తిరిగి ఇవ్వడం లేదని లీగల్ నోటీసు పంపించారు. ఇప్పుడు ఆ రూ.25 లక్షలు ఇచ్చిన ఎమ్మెల్యే సోదరుడు సైతం అదే ఎమ్మెల్యేకు రూ.8 కోట్లు ఇచ్చారట. అవి తిరిగి ఇవ్వాలని.. లేకపోతే అన్న మాదిరే తాను లీగల్ నోటీస్ ఇస్తానని.. లేదా మంత్రి పదవి విషయంలో మిన్నకుండిపోవాలని చెప్పడంతో సదరు ఎమ్మెల్యే మంత్రి పదవి రేసు నుంచి తప్పుకున్నారనే ప్రచారం జిల్లాలో జోరుగా నడుస్తున్నది.

### పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని, కాంప్రమైజ్‌కు ఫోర్స్..

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే.. మరో ఎమ్మెల్యే బంధువు ఎంపీగా గెలవడానికి డబ్బులు తీసుకోవడం, అవి కాకుండా వ్యక్తిగతంగా చెక్‌లు పెట్టి రూ.8 కోట్లు తీసుకోవడంపై అధికార పార్టీ రాష్ట్ర నాయకత్వం సైతం సీరియస్ అయ్యిందట. జిల్లాలో నీ గ్యాంగ్ చేసే అరాచకాలు చాలు. మాకు మొత్తం తెలుసు.. మంత్రి పదవి విషయంలో జోక్యం చేసుకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని, పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో సదరు ఎమ్మెల్యే ఏం చేయాలో తెలియని గందరగోళంలో పడిపోయారట. రాష్ట్రంలోని అధినాయకత్వాన్ని కాదని ఏం చేయలేనని, అలాగని రూ.8కోట్లు ఇప్పుడు ఇచ్చే పరిస్థితి లేదని సదరు ఎమ్మెల్యే మిన్నకుండిపోయినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. పార్టీ కోసం కష్టపడ్డానని, గడిచిన పదేళ్లలో ఎవరు ఉన్నా.. లేకున్నా ఉమ్మడి జిల్లాలో పార్టీని కాపాడుకుంటూ వచ్చానని.. అది గుర్తించి తనకే పదవి ఇవ్వాలంటూ తనకు సన్నిహితంగా ఉండే మంత్రుల ముందు సదరు ఎమ్మెల్యే మాట్లాడుతున్నట్లు తెలిసింది. కానీ, రాష్ట్రంలో అధికార పార్టీని శాసించే కీలక నేత మాత్రం ఎమ్మెల్యేపై కాంప్రమైజ్ కావాలంటూ ఫోర్స్ చేస్తుండడంతో ఏం చేయాలో తెలియక సదరు ఎమ్మెల్యే అయోమయంలో పడిపోతున్నట్లు తెలిసింది.

### ఆ కౌన్సిలర్ ఇంటికి క్యూ..

జిల్లా కేంద్రానికి చెందిన ఎమ్మెల్యే రూ.8 కోట్ల చెక్కుల విషయంలో లాక్ అయిపోవడం, ఆయనకు కాకుండా డబ్బులు బాగా ఉన్న మరో నియోజకవర్గ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఖాయమని అధిష్ఠానం నుంచి సంకేతాలు రావడంతో క్షేత్రస్థాయిలోని కేడర్ సైతం అలర్ట్ అయినట్లు విశ్వసనీయ సమాచారం. తమ ఎమ్మెల్యేకు మంత్రి పదవి రాదని తెలియడంతో మంత్రి పదవి వచ్చే ఎమ్మెల్యేకు సన్నిహితంగా ఉండే మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ మాజీ కౌన్సిలర్ ఇంటికి దందాలు చేసే నాయకులందరూ క్యూ కట్టారట. సార్‌కు చెప్పండి మేము కో-ఆపరేట్ చేస్తాంటూ సదరు కౌన్సిలర్‌కు కొంత ముట్టజెప్పారట. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా ఉండే ఓ లీడర్ (మంచిర్యాల బైపాస్ రోడ్డులో నాలాపై అక్రమ నిర్మాణం చేస్తున్న ఓ నేత) సైతం భారీ మొత్తం సదరు కౌన్సిలర్‌కు అప్పగించారనే టాక్ నడుస్తున్నది. ఈ కౌన్సిలర్‌ను గతంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే.. మున్సిపాలిటీలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో గోల్‌మా ల్ చేశారంటూ అరెస్టు చేయించారు. ఆ సమయంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యేకు పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే (రూ.8కోట్లు ఇచ్చిన ఎమ్మెల్యే) ఫోన్ చేస్తే ఆ విషయం తప్ప మరేదైనా చెప్పండంటూ ఎమ్మెల్యే మాట్లాడారట. దాన్ని మనసులో పెట్టుకున్న రూ.8 కోట్లు ఇచ్చిన ఎమ్మెల్యే తర్వాత చూసుకుందాం.. నేను ఉన్నానంటూ సదరు కౌన్సిలర్‌కు భరోసా ఇచ్చారట. తాజాగా.. మంత్రి పదవి దాదాపు ఖాయమైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలోకి అధికార పార్టీ లీడర్లు సదరు మాజీ కౌన్సిలర్‌కు దగ్గరైన ఎమ్మెల్యేకు మంత్రి పదవి వస్తే ఇబ్బందులు తప్పవని.. సదరు నేతకు ముందే ముడుపులు ముట్టచెప్పే పనిలో తలమునకలైనట్లు తెలిసింది. ఏదేమైనా మంత్రి పదవి రేస్ నుంచి రూ.8కోట్లకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కాంప్రమైజ్ అవ్వడంపై ఆయన అనుచరులే పెదవి విరుస్తున్నారు. మా సార్‌కు మంత్రి పదవి వస్తుందని విచ్చల విడి చేశామని, ఇప్పుడు తీరా మా సార్‌ను కాదని పక్క నియోజకవర్గం ఎమ్మెల్యేకు పదవి ఇస్తున్నా.. మా సార్ ఉలుకూ.. పలుకూ లేకుండా మిన్నకుండిపోతున్నారంటూ వాపోతున్నారు. ఏ సార్‌కు మంత్రి పదవి వచ్చిన మా పనులైతే ఆపొద్దని క్షేత్రస్థాయిలోని లీడర్లు వేడుకుంటున్నట్లు తెలిసింది. చీప్‌గా రూ.8 కోట్లకు మంత్రి పదవి వదులుకోవడం ఏమిటి.. మమ్ముల్ని అడిగినా మేం ఇచ్చేవాళ్లం కదా అంటూ జిల్లా కేంద్రానికి చెందిన ఎమ్మెల్యే సన్నిహితులు బయట ప్రచారం చేస్తున్నట్లు జిల్లాలో జోరుగా చర్చ నడుస్తున్నది.



అడుగంటిన బావిలోకి మిషన్ భగీరథ నీటిని పైపులైన్ ద్వారా వదులుతున్న సిబ్బంది

## బావిలోకి 'భగీరథ' జలం

**'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన**

లింగాపూర్, మార్చి 31 : చోర్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుట్టభద్రలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయి గ్రామస్తులు తాగు నీటికి ఇబ్బందులు పడుతుండగా, సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'భగీరథ కోసం ఎదురుచూపు' శీర్షికన కథనం ప్రచురించింది. ఇందుకు అధికారులు స్పందించారు. ఎంపీడీవో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. తాగు నీటి సమస్యపై గ్రామస్తులతో చర్చించారు. ఇంటింటికీ నీరందించే పరిస్థితి లేకపోవడంతో నేరుగా అడుగంటిన బావిలోకి మిషన్ భగీరథ జలాన్ని వదిలారు. గిరిజనులు ఆ బావిలోని నీటిని తోడుకొని గొంతు తడుపుకుంటున్నారు. కాగా, తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రూప్-1 ఫలితాల్లో గిరిజన యువతి సత్తా

- రాష్ట్రస్థాయిలో 38వ ర్యాంకు
- ఉమ్మడి జిల్లాలో మొదటి ర్యాంకు



వనజ

నస్పూర్, మార్చి 31 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గిరిజన యువతి బానావత్ వనజ గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 38వ ర్యాంకు సాధించింది. రైతు బానావత్ దశరధ్ -లలిత దంపతుల మూడో కుమార్తె వనజ కష్టపడి చదివి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొదటి ర్యాంకు తెచ్చుకున్నది. దండేపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. ఐటీడీఏ స్కాలర్‌షిప్‌తో కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ కాలేజీలో ఇంటర్ ఇంగ్లిష్ మీడియం పూర్తి చేసింది. కాకతీయ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ చదివింది. మూడేళ్లుగా హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో చేరి సివిల్స్‌కు సిద్ధమైంది. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలో ఎస్టీ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం సాధించింది. తర్వాత జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల్లో ర్యాంకు సాధించింది. వారం క్రితమే వరంగల్ జూనియర్ కళాశాలలో ఉద్యోగంలో చేరింది. ఇప్పుడు గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 504.5 మార్కులు సాధించి 38వ ర్యాంకు తెచ్చుకున్నది. వనజకు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం వస్తుందని భావిస్తున్నారు. వనజను కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు, స్థానికులు ఆమెను అభినందించారు.

## జిల్లా ఉపాధి కల్పన అధికారిపై ఛీటింగ్ కేసు

**ఆర్టీఐ సమాచారం ఇవ్వకపోవడమే కారణం**

మంచిర్యాల, మార్చి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారిపై ఛీటింగ్ కేసు నమోదైంది. మందమర్రికి చెందిన ఓ వ్యక్తి గతేడాది ఏప్రిల్ 10న ఉపాధి కల్పన కార్యాలయం ద్వారా 2024లో ఎప్లాయ్‌మెంట్‌లో పాల్గొన్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల నియామకాల వివరాలు కావాలని సమాచారం హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. ఇందుకు జిల్లా అధికారి మీరు అడిగిన సమాచారం 10,034 కాపీగా ఉందని, కాపీకి రూ.2.50 చొప్పున రూ.25,085 డీడీ రూపంలో చెల్లిస్తే సమాచారం ఇస్తామంటూ వివరణ ఇచ్చారు. దానికి సదరు వ్యక్తి డీడీ నంబర్: 06921 ద్వారా కోరిన మొత్తం చెల్లించారు. అయినా సదరు అధికారి సమాచారం ఇవ్వడంలో కాలయాపన చేశారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఎట్టకేలకు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు మంచిర్యాల పోలీసులు జిల్లా ఉపాధి కల్పన అధికారిపై సెక్షన్ 420 ఐపీసీ, 173(4) బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేశారు.

## తలాపునే గొల్లవాగు.. తడారుతున్న పొలాలు

- ఇప్పటికే 15 బోర్లు ఫెయిల్
- ఆందోళనలో అన్నదాతలు



ఎండిన పొలం వద్ద సెల్ఫీ దిగిన రైతు సందల తిరుపతి

భీమారం, మార్చి 31 : భీమారం మండలం అర్కపల్లి సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్టు ఉన్నా.. పంట పొలాలు ఎండిపోతున్నాయి. గొల్లవాగు ప్రాజెక్ట్ కూత వేటు దూరంలో ఉన్నప్పటికీ అర్కపల్లి శివారులో సాగవుతున్న పొలాలకు నీరందడం లేదని రైతులు ముంజం నారాయణ, సూరం సంపత్, సందల తిరుపతి, కాల్వ మల్లయ్య, సుంకరి రమేశ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ యాసంగిలో అర్కపల్లిలో 50 ఎకరాల్లో వరి సాగు చేయగా, ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి పంటలకు నీరందించలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికే 15 బోర్లు వేస్తే ఫెయిల్ అయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్కపల్లి శివారులోని వాగులోనూ నీరు ఎండిపోయిందని, గొల్లవాగు ప్రాజెక్టు కాలువ ద్వారా స్థానిక చెరువును నింపితే పంటలకు సరిపడా నీరందించవచ్చని రైతులు పేర్కొంటున్నారు.



అర్కపల్లి శివారు ప్రాంతంలో ఎండిన పొలం

బావి వద్ద నీటిని తోడుకుంటున్న ప్రజలు



## పానీ పాట్లు

*రాఘపూర్ గ్రామ పంచాయతీని తాగు నీటి సమస్య వెంటాడుతున్నది. మిషన్ భగీరథ ట్యాంకులోకి నీరు ఎక్కుతున్నా.. నిర్వహణ సరిగా లేక కాలనీలకు సరఫరా కావడం లేదు. చేతిపంపు, బోరు పాడైపో వడంతో ప్రజానీకం తాగు నీటికి పాట్లు పడుతున్నది. గొంతు తడుపుకునేందుకు గ్రామ సమీపంలోని పాత బావి వద్దకు కాలి నడకన వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని తాగు నీటి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.*

*- సిర్పూర్(యూ), మార్చి 31*